## మున్సిపాల్టీలో ఉద్యోగాలు పెట్టిస్తానని మోసం

### - పోలీసులను ఆశ్రయించిన బాధితులు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 5 : మున్సిపాల్టీలో ఉద్యోగాలు పెట్టిస్తానని మోసం చేశారంటూ కొందరు బాధితులు సోమవారం సాయంత్రం మంచిర్యాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల మున్సిపాల్టీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న చింటు అనే వ్యక్తి ఎనిమిది మందికి ఉద్యోగాలు పెట్టిస్తానని ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.50వేల చొప్పున తీసుకొని తీరా ఉద్యోగాలు పెట్టివ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నవీన్‌తో పాటు మరో ఎడుగురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చెపట్టనున్నట్లు సీఐ తెలిపారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 5 : మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్ఐ రాజేశ్వర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తూ వాహన చోదకులను బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. వాహనాలకు పెండింగ్ చలాన్లు లేకుండా చూసుకోవాలన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 5 : జిల్లా కేంద్రంలోని సామాజిక ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ గౌడ్ డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సోమవారం దవాఖాన ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం ఆస్పత్రి సూపరిండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి మల్లేష్ కార్మికులు మురళి నీల, మమత పాల్గొన్నారు.

## పదోన్నతి ఉద్యోగుల్లో బాధ్యత పెంచుతుంది

ఆసిఫాబాద్ టౌన్,ఆగస్టు 5 : ఉద్యోగుల్లో పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి అన్నారు. జిల్లాలోని వివిధ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురు స్కూల్ అసిస్టెంట్‌లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన వారిని సోమవారం శాలువాతో సన్మానించారు.

## మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

రెబ్బెన, ఆగస్టు 5 : మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీ టీం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. మండలంలోని గంగాపూర్ గ్రామ శివారులో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సోమవారం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కేజీబీవీ ఎస్‌వో పద్మ, షీ టీం సభ్యులు సునీత, శ్రీలత, సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త మృతి

తిర్యాణి, ఆగస్టు 5 : మండలంలోని మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన ఆత్రం భూదేరావు(45)అనే సీనియర్ బీఆర్ఎస్ కార్యకర్త సోమవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. భూదేరావు గత 15ఏళ్లుగా బీఆర్ఎస్ పార్టీకి ఎనలేని సేవలు అందించాడు.

## వాగులో పడి మహిళ మృతి

తిర్యాణి, ఆగస్టు 5 : మండలంలోని భీంజీగూడ పంచాయితీ పరిదిలోని బుగ్గగూడ గ్రామానికి చెందిన టేకం రాజుభాయి (35) అనే కొలాం గిరిజన మహిళ సోమవారం ప్రమాదావశాత్తు వాగులో పడి మృతి చెందినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామ సమీపంలోని వాగు వద్దకు వెళ్లి బట్టలు పిండుతుండగా ఆకస్మత్తుగా మూర్చవ్యాధి రావడంతో వాగులో పడి మృతి చెందింది. మృతురాలి భర్త టేకం భీము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## పురుగుల మందు తాగి విద్యార్థి మృతి

వాంకిడి,ఆగస్టు 5 : మండలంలోని బెండార గ్రామానికి చెందిన సెండే సోని (20)అనే విద్యార్థి కడుపునొప్పి భరించలేక సోమవారం పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు సోని హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ కళాశాలలో జీఎఎన్ఎం చదువుతుండేది, ఈ క్రమంలో గత సంవత్సరం నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. తండ్రి బొంద్యాలు ఉదయం పని నిమిత్తం బయటికి వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోయి కనిపించింది. వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి బోంద్యాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## తప్పడు ప్రచారాలు మానుకోవాలి

మందమర్రి, ఆగస్టు 5 : సింగరేణిలో గుర్తింపు పొందిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) పైన ఐఎన్‌టీయుసీ, సీఐటీయూ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను మానుకోవాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా ఉపాధ్యక్షుడు భీమనాధుని సుదర్శన్‌లు అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ జాయింట్ సెక్రటరి కంది శ్రీనివాస్, నాయకులు టేకుమట్ల తిరుపతి, బాణయ్య, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## డీసీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 5 : బాధితుల సమస్యలను తెలుసుకుని చట్ట పరిధిలో తగు పరిష్కార మార్గాన్ని సూచించుటకు ప్రయత్నిస్తామని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. సోమవారం డీసీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలతో డీసీపీ కార్యాలయానికి వచ్చిన బాధితులకు భరోసా కల్పించామన్నారు.

# దరఖాస్తుల పరిష్కారానికి కృషి

నస్పూర్, జూలై 5 : ప్రజావాణిలో ప్రజలు అందించినదరఖాస్తుల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయల భవన సముదాయంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి,మంచిర్యాల, భీమారం, నస్పూర్, హాజీపూర్, మందమర్రి, జైపూర్, కాసిపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై సంబంధిత అధికారుల సమన్వయంతో పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు. కాగా, రేచిని గ్రామానికి చెందిన స్వప్న.. ఇటీవల ప్రభుత్వం చేసిన రుణమాఫీ నాకు కాలేదని, పేరు స్వప్న కాగా, ఇందులో ఒక అక్షరం తప్పుగా ఉండడంతో కాలేదని అధికారులు తెలిపారని ఫిర్యాదు చేసింది. అలాగే భీమారం మండలంలోని ఆరేపల్లి గ్రామ శివారులోని రైతులు.. ఎర్రచెరువు నుంచి తమ 206, 204, 197, 203, 210, 204 సర్వే నంబర్లలోని భూములకు నీరు రావడంలేదని, సమస్య పరిష్కరించాలని అర్జీ పెట్టుకున్నారు. అలాగే మంచిర్యాలలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకురాలు పుష్పలతను విధుల నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ, యుఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, తిరుపతి ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకురాలు విద్యార్థినులతో పనులు చేయించుకుంటున్నారని పేర్కొనానరు. వెంటనే ప్రిన్సిపాల్, అధ్యాపకురాలును విదుల నుంచి తొలగించాలని కోరారు.

**కలెక్టర్‌కు వినతి..**

హాజీపూర్, ఆగస్టు 5 : జిల్లాలోని నాల్గవతరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కొరుతు జిల్లా అధ్యక్షుడు గీట్ల సుమిత్ ఆధ్వర్యంలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అధ్యక్షుడు మాట్లా డుతు మహిళా ఉద్యోగులను రాత్రివేళ కార్యాలయాల్లో డ్యూటీ చేయడం కష్టతరంగా ఉందని, వారికి రాత్రి కార్యాలయాల్లో విధుల నుంచి వెసులుబాటు చేయాలని కోరారు.

**సమస్యల పరిష్కారానికి చర్యలు**

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 5 : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బెల్లంపల్లి దవాఖానకు పూర్వవైభవం తీసుకరావాలి

బెల్లంపల్లి, ఆగస్టు 5 : బెల్లంపల్లి సింగరేణి ఏరియా దవాఖానకు సెప్టెంబర్ చివరి వారంలోపు పునర్‌వైభవం తీసుకురాకపోతే ఏరియా దవాఖాన పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆ కమిటీ అధ్యక్షుడు టీ. మణిరామ్‌సింగ్ హెచ్చరించారు. సోమవారం స్థానికంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తమ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలతో సింగరేణి యాజమాన్యం దిగివచ్చి సీఎంవోతో దవాఖానను సందర్శించారని పేర్కొన్నారు. ఈ విషయం పై సీఎంవోతో ఎమ్మెల్యే సైతం విస్తృతంగా చర్చలు జరిపారని వివరించారు. పదిహేను రోజుల తర్వాత దవాఖానను సందర్శిస్తానని ఎమ్మెల్యే ప్రకటించడంపై వారు సంతో షం వ్యక్తం చేశారు. పరిరక్షణ కమిటీ నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్ ఉన్నారు.

## చెత్త పోయవద్దని రెల్లి కులస్తుల నిరసన

సీసీసీ నస్పూర్, ఆగస్టు 5 : సీసీసీ టౌన్‌షిప్‌లోని శివారు ప్రాంతంలో గల సింగరేణి స్థలంలో ఏర్పాటు చేసిన నస్పూర్ డంపు యార్డు నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. పోలేరమ్మ ఆలయానికి చెందిన రెల్లి కులస్తులు సోమవారం మున్సిపల్ చెత్త తరలించే వాహనాలను అడ్డుకుని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రెల్లి కుల సంఘం అధ్యక్షుడు గూడుపు సింహాచలం మాట్లాడుతూ డంపుయార్డు సమీపంలోనే పోలే రమ్మ, మడేలయ్య, ముక్కిడి పోచమ్మ ఆలయాలు ఉన్నాయని ఆలయాల వద్ద మున్సిపాలిటీకి చెందిన తడిపొడి చెత్త డంపింగ్ చేయడం వల్ల భరించ లేని దుర్వాసన వస్తుందని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే ఆలయాల వద్ద పోసిన చెత్తను తొలగించి, మరో సారి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలేరమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.














